

ఆర్టీసీ బస్సులు మలిపేదెలా!
- రామాయంపేట బస్టాండ్ లోనికి వెళ్లేందుకు, వచ్చే దారిలో అడ్డంగా వాహనాలు
- ఆర్టీసీ డ్రైవర్ల తప్పని అవస్థలు
- బస్టాండు మూలమలుపులో పూల వ్యాపారాలు

6

రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామాలో ఉత్తమ నటుడిగా బీరంగూడ విద్యార్థి



ఉత్తమ నటుడిగా ఎంపికైన బీరంగూడ విద్యార్థి సాయిరాం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : ఎస్‌సీఈఆర్‌టీలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ లో సంగారెడ్డి జిల్లా బీరంగూడ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. బీరంగూడ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న సీహెచ్.సాయిరాం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ సాయిరాంకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. సాయిరాంను డీఈవో వెంకటేశ్వర్లు, నోడల్‌ఆఫీసర్ లింబాజీ, సీఎంవో వెంకటేశం, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, పాఠశాల హెచ్ఎం వసంత అభినందించారు.

రేపు అండర్-19 క్రికెట్ జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో ఈ నెల 22న సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీలో అండర్-19 క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటలవరకు హాజరుకావాలని సూచించారు.

యేటా ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారుల ఉపాధికి భరోసా కల్పించేది. 2016లో ఉచిత చేప విత్తనం పంపిణీ పథకం ప్రారంభం కాగా గతేడాది వరకు ఎనిమిదిసార్లు అందజేశారు. ప్రతీ ఏడాది మే, జూన్ వరకు టెండర్లను పూర్తి చేసి అగస్టులోగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపలను వదిలే వారు. ఈ ఏడాది ఇప్పటివరకు చేపపిల్లలను పంపిణీ చేయకపోవడంతో గంగపుత్రులు గాబరా పడుతున్నారు. చేప విత్తన పంపిణీకి అదను దాటిపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు కసరత్తు చేస్తున్నారు. అధికారుల నిర్ణయంపై మత్స్యకారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు.

- మెదక్, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి)



మత్స్యకారుల్లో ఆశలు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అధికారుల కసరత్తు
నేడు మత్స్యశాఖ ఏడీలతో అత్యవసర సమావేశం
ఇప్పటికే ఆలస్యమైన చేప పిల్లల పంపిణీ

టెండర్లలో నెలకొన్న జాప్యం కారణంగా ఈ ఏడు చేపపిల్లల విడుదలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. గతేడాది సరఫరా చేసిన చేపపిల్లల విత్తనాల పంపిణీకి సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల కాకపోవడంతో ఈసారి ఆన్‌లైన్ టెండర్లు పాల్గొనేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. ఎన్నిసార్లు నిర్వహించిన టెండర్లు ఖరారు కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలలో చేప పిల్లల పంపిణీ నిలిచిపోయింది. ఆగస్టు మాసంలో వదిలే చేప విత్తనం అక్టోబరు మూడో వారం వరకు సరఫరా చేయకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం మరోమారు టెండర్లను పిలవడానికి ప్రభుత్వానికి సమయం చాలకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే సోమవారం హైదరాబాద్‌లోని ఫిషరీస్ కమిషనరేట్ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ నుంచి జిల్లా మత్స్య సహకార అభివృద్ధి అధికారులకు పిలుపు వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో చేప పిల్లల పంపిణీకి మార్గం సుగమం కావచ్చునని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



చేపపిల్లలను వదులుతున్న మత్స్య కారులు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో సొసైటీలు, సభ్యులు

జిల్లా	సొసైటీ	సభ్యులు
మెదక్	284	15,721
సంగారెడ్డి	229	12,891
సిద్దిపేట	338	24,700

గతేడాదిలో సగమే.. అదీ ఆలస్యం

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 851 సొసైటీల్లో 53,312 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. వీరికి ఉపాధి కల్పించేందుకు 6.47 కోట్ల చేప పిల్లలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జలాశయాల్లో వదిలేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అందులో మెదక్ జిల్లాలో 1,651 చెరువులు, కుంటలతో పాటు ఘనపూర్, హల్దీ, పోచారం ప్రాజక్టులలో ఈ సీజన్‌లో 2.62 కోట్ల చేప విత్తనం వదలాల్సి ఉంది. ఇది గత సంవత్సరం కంటే 50 శాతం తక్కువ. 2023-24 సీజన్‌లో 5.25 కోట్ల చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈసారి అందులో సగ భాగమే ఇవ్వాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 1,561 జలాశయాలతో పాటు, కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకమ్మ సాగర్ ప్రాజక్టులలో పెంపకానికి 4.30 కోట్ల పిల్లలు అవసరం ఉండగా 2.15 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 1157 చెరువులు, కుంటలతో పాటు మూడు రిజర్వాయర్లలో 3.41 కోట్ల చేప విత్తనం వదలాల్సి ఉండగా, 1.70 కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రణాళిక రూపొందించారు. టెండర్లు ఖరారు కాకపోవడంతో ఈ అరకొర చేపపిల్లల పంపిణీ కూడా ఆలస్యమైంది.

మీ త్యాగం మరువం

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- వారి కుటుంబసభ్యులకు సన్మానం
- నేటి నుంచి 31 వరకు అవగాహన కార్యక్రమాలు

7

1997లో పిల్లుట్ల మందుపాతర పేలుడులో నాటి తూప్రాన్ డీఎస్పీ, సీఐ.. 1999లో పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌ను నక్సల్స్ పేల్చివేసిన ఘటనలో ఐదుగురు కానిస్టేబుళ్లు అమరులయ్యారు. విధినిర్వహణలో అసువులుబాసిన పోలీస్ అమరవీరులను స్మరిస్తూ ఏటా సంస్మరణం దినాన్ని నిర్వహిస్తున్నారు. నేడు అమరుల కుటుంబాలను సన్మానించనున్నారు.



మంత్రాల నెపంతో దాడులు చేస్తే సహించం

కిష్టాపూర్ గ్రామస్థులకు పోలీసుల కౌన్సెలింగ్



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

తూప్రాన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాల నెపంతో, మూఢనమ్మకాలతో ఇతరులపై దాడులు చేస్తే సహించబోమని ఎస్ఐ శివానందం హెచ్చరించారు. తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన భూమొళ్ల పోచయ్య మృతిచెందడంతో భార్య కమలమ్మ, కొడుకు స్వామి, కోడలు నవనీత, బిడ్డలు, అల్లుళ్లపెద్దలకు చేసుకున్నారు. పెద్దలకు చేయడంతో పోచయ్య ఆత్మ గ్రామంలో తిరుగుతుందని శనివారం స్వామి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఎస్ఐ శివానందం ఎస్సీ కాలనీలో గ్రామస్థులతో సమావేశమై కౌన్సెలింగ్ చేశారు. మంత్రాలు, తంత్రాలు లేవని, మూఢనమ్మకాలతో విపరీత చేష్టలకు పాల్పడవద్దని సూచించారు. మంత్రాల పేరుతో మరోసారి దాడులు చేస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు.

యాసంగి సాగు.. 2.05 లక్షల ఎకరాల్లో

సంగారెడ్డి జిల్లాలో సాగు ప్రణాళిక ఖరారు
వ్యవసాయాధికారుల అంచనాలు సిద్ధం
అందుబాటులో విత్తనాలు, ఎరువులు



సంగారెడ్డి టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో యాసంగి పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా 2.05 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తారని అంచనా వేశారు. గతేడాదితో పోలిస్తే సాగు పెరగనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. వానాకాలం సీజన్ ఆరంభంలో సరైన వర్షాలు లేక పోవడం.. చివర్లో అధిక వర్షాలతో ఆయా పంటలకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. దీంతో రైతులు యాసంగిపై ఆశలు పెట్టుకున్నారు.

15 వేల ఎకరాలు అధికం

గతేడాది యాసంగి జిల్లాలో 1,91,500 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేశారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో 2.05 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేసే అవకాశాలున్నట్లు అంచనాలు సిద్ధం చేశారు. గతేడాదితో పోలిస్తే ఇది 15వేల ఎకరాలు అధికం. ఈసారి యాసంగిలో వరి, జొన్న, మొక్కజొన్న పంటల సాగు అత్యధికంగా ఉండవచ్చని భావిస్తున్నారు.

జిల్లాలో యాసంగి పంటల సాగు అంచనా

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)
వరి	1,10,000
జొన్న	59,000
మొక్కజొన్న	5,500
గోదుమ	500
చెరుకు	1,600
తెల్ల కుసుమ	3,100
నువ్వులు	200
పొద్దుతిరుగుడు	400
శనగ	2,000
వేరు శనగ	200

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

పంటల విస్తీర్ణం అంచనాకు అనుగుణంగా అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. యూరియా 18,413 మెట్రిక్ టన్నులు, డీఏపీ 6,308 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 3,660 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 14,300 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్పీ 3,650 మెట్రిక్ టన్నులు అవసరమని ప్రతిపాదనలు తయారుచేశారు. అక్టోబరులో యూరియా 9,542 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1901 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 612 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 4,407 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్పీ 433 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



మహా కలశ యాత్ర

రాయికోడ్‌లో హనుమాన్ మందిరం పునఃప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి మహిళలు కలశాలతో ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చారు.

- రాయికోడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి)



జహీరాబాద్‌లో నిర్వహించిన ఆందోళనలో ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

రైతు రుణమాఫీలో మోసం.. రైతు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం అన్నదాతలను దగా చేస్తుందని, ఎట్టి పరిస్థితుల్లో రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తూ ఆదివారం మెదక్, సంగారెడ్డి జిల్లాల వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. పలుచోట్ల సీఎం దిష్టిబొమ్మ దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



మెదక్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, పార్టీ శ్రేణులు

విద్యార్థుల సేవాపథం.. ఎన్ఎస్ఎస్ శిబిరం

- వారం పాటు గ్రామస్థులతో మమేకం
- ప్రత్యేక కార్యాచరణతో అవగాహన కార్యక్రమాలు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో వారం రోజుల పాటు ఉండి గ్రామస్థులతో మమేకమై పారిశుధ్యం, వ్యవసాయం వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో మార్పు తీసుకువచ్చేలా కార్యచరణ రూపొందించింది. ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రతీ ఏటా జిల్లాలో ఒక గ్రామాన్ని ఎంచుకుని ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదితో ఎన్ఎస్ఎస్ 55 సంవత్సరాలు పూర్తి చేసుకోగా, హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన వ్యవసాయ కళాశాల, సంగారెడ్డి జిల్లా కందిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన 140 మంది విద్యార్థులు మండల పరిధిలోని ఫసల్‌వాదీ గ్రామంలో ఈ నెల 16వ నుంచి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. 22 వరకు కొనసాగనున్నది. ఈ కార్యక్రమంతో విద్యార్థులకు సమాజంపై అవగాహన ఏర్పడడంతో పాటు సేవాభావం అలవడుతుంది.

చేపట్టే కార్యక్రమాలు

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పారిశుధ్య సమస్యను పరిష్కరించేలా విద్యార్థులు పిచ్చి మొక్కలు, పొదలను గ్రామస్థులతో తొలగిస్తారు. ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ లాంటి భయానక వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉన్నదని, మద్యం, గంజాయి, మత్తు పదార్థాల వాడకంతో కలిగే దుష్ప్రభావాలను వివరిస్తారు. వ్యవసాయంలో పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేస్తే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి, ఏ భూముల్లో ఎలాంటి పంటలు వేయాలి, పంటలకు ఏ రకం ఎరువులు, ఎంత మోతాదులో వాడాలనే విషయాలను వివరిస్తారు. రైతుతో ఎన్ఎస్ఎస్ వలంటీర్ వారి కుటుంబంలో కలిసిపోయి నాలుగు నెలల పాటు వారికి దగ్గరుండి శిక్షణనందించి పంటల్లో అధిక దిగుబడి సాధించేలా కృషి చేస్తారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు అందించే సర్టిఫికెట్లతో ఏ శాఖలోనైనా ఉద్యోగాల కోసం వెళ్లే ఇంటర్వ్యూల్లో వెసులుబాటు (రిజర్వేషన్లు) కల్పిస్తారు.



ఫసల్‌వాదిలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సేంద్రియ ఎరువులపై అవగాహన



సేంద్రియ ఎరువులు ఎలా, ఎంత మోతాదులో వాడాలనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. సేంద్రియ ఎరువులతో పంటలకు బలం చేకూరుతుంది. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు వివరిస్తున్నాం.

- ఉమేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్

వ్యవసాయంలో మెలకువలు అందిస్తాం



పంటలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ పంటకు ఏ ఎరువులు వాడితే లాభాలు వస్తాయనే విషయాలపై శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తాం. నేరుగా రైతులతో వలంటీర్లు నాలుగు నెలల పాటు దగ్గరుండి శిక్షణ కల్పిస్తాం.

- అమీర్ భాష, ప్రోగ్రామ్ అధికారి

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త

- పిల్లల్లో మానసిక, శారీరక సమస్యల గుర్తింపునకు ప్రత్యేక యాప్
- వివరాలు పొందుపరిచి చికిత్స..63 ప్రశ్నలతో రెండు విడతల్లో పరీక్ష
- ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు

7



అసలే ఇరుకు రోడ్లు.. ఆపై అడ్డంగా తోపుడు బండ్లు

- నారాయణఖేడ్ పట్టణంలో ట్రాఫిక్ ఇక్కట్లు
- పాదాచారులకు తప్పని ఇబ్బందులు

8



కాలువలో పడి వ్యక్తి మృతి

న్యాల్‌కల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాల్కి గ్రామ సమీపంలో గల కత్వకాలువలో పడి కమ్మరిగోపాల్ మృతిచెందాడని జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు తెలిపారు. మృతుడు కొంతకాలంగా జహీరాబాద్, న్యాల్‌కల్ మండల పరిసర ప్రాంతాల్లో కూలీ పనులను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గోపాల్‌కు మూర్ఛ ఉన్నదని.. ఈ క్రమంలో కాలువలో పడి మృతిచెంది ఉంటాడని చిన్నాన్న రాంచందర్ చెప్పారు. చిన్నాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులు మలిపేదెలా..!

● ఇన్-ఔట్‌కు అడ్డంగా వాహనాలు ● ఆర్టీసీ డ్రైవర్ల అవస్థలు



ఆర్టీసీ బస్టాండ్ మూల మలుపులో నిలిపిన వాహనాలు

రామాయంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లి రావడం గగనమవుతోంది. ప్రతినిత్యం డ్రైవర్లు మూలమలుపులో రోడ్డు మీదకు వచ్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇన్-ఔట్ ప్రదేశంలో తరచూ వాహనాలు అడ్డంగా నిలపటం ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ఇరుకుగా ఉన్న ఈ మలుపులో ఆర్టీసీ బస్సులు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలు ఉన్నాయి. చిన్నపాటి రహదారి ఒక పక్క.. ఆ టర్నింగ్ వద్దే కార్లు, ద్విచక్ర వాహనాలు ఆపటం మరోపక్క ప్రమాదాలకు తావిస్తున్నాయి. బస్టాండ్ స్థలం ఆక్రమించి పూలు, పండ్ల దుకాణాలు తెరవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఆర్టీసీ బస్టాండ్ రద్దీ ప్రదేశంలో ఉండటం.. ఇందుకు తగ్గట్టుగా రోడ్డు విస్తరణ జరగకపోవడం వల్ల ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. ఇకనైనా రహదారిని వెడల్పు చేసి ఆక్రమిత ఫుట్‌పాత్ వ్యాపారాలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంగ్రెస్ నేతల తీరును మంత్రి దృష్టికి తీసుకెళ్లాలి

● చిల్వర్‌లో కార్యకర్తల రహస్య సమావేశం



చిల్వర్‌లో సమావేశం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్లాదుర్గం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండల కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానిస్తూ.. ఆదివారం అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామంలో కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రహస్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుతీరుపై, ఇందిరమ్మ ఇళ్ల కమిటీల నియామకం తదితర అంశాలపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ గ్రామాల్లో గ్రూపులకు ఆజ్యం పోస్తున్నారని వారు చర్చించుకున్నట్లు సమాచారం. కొన్నాళ్లుగా జరుగుతున్న ఈ వ్యవహారంపై పలుమార్లు పార్టీ సమావేశంలో చర్చించినా ఎలాంటి మార్పురాలేదని కొందరు కార్యకర్తలు గుర్తుచేశారు. ఇందిరమ్మ కమిటీల్లోనూ ఒకే వర్గానికి చెందినవారి పేర్లనే ఎంపిక చేశారని, ఈ విషయాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు తీర్మానించినట్లు తెలిసింది.

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE

రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన కానుకగా
రేపే బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
8.00,11.15,8.45,6.00,9.30

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



సప్తగిరి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
మల్లికార్జున 70ఎంఎం - కూకట్‌పల్లి
మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్
NTR CINEMAS 9030161717

విజయవంతమైన 2వ వారం



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ 11.00,2.00,6.00,9.00

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



NTR CINEMAS RELEASE

ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్
MG MOVIES 9989522999

విజయవంతమైన 4వ వారం



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.15,9.45

BLOCKBUSTER ENTERTAINER



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

మల్టీప్లెక్స్ - 200/-, సింగిల్ స్క్రీన్ - 150/-
WATCH AND ENJOY WITH YOUR FAMILY AT LOWEST PRICE



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.15,6.15,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE



SUCHIN CINEMAS LLP THRU NTR CINEMAS 9030161717

క్రైం కార్నర్

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ

● నగదు, వెండి, బంగారు ఆభరణాలు అపహరణ


శివ్వంపేట: చిన్నగొట్టిముక్కలలో బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

శివ్వంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న రెండు ఇళ్ల తాళాలను పగులగొట్టి నగదు వెండి, బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కొడకంచి శంకర్‌గౌడ్ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గడ్డపారతో ఇంటి తాళాలను పగులగొట్టి రూ.1.50 లక్షల నగదు, 20 తులాల వెండి, తులం మూడు గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయారు. అదేవిధంగా కోలమద్ది శ్రీపతిరావు ఇంటికి తాళం వేసి మూడురోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి పది తులాల వెండి, రూ.5 వేల నగదు అపహరించుకుపోయారని గ్రామస్థులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీం పరిశీలించగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

బ్యాగులోంచి బంగారు ఆభరణాలు చోరీ

నారాయణఖేడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న ఓ మహిళా బ్యాగులోంచి గుర్తుతెలియని వ్యక్తులు 6.30 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. నాగల్‌గిద్ద మండలం ఏనక్‌పల్లికి చెందిన నిర్మల కొన్నేళ్లుగా కుటుంబీకులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటుంది. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో బంధువుల ఇంట్లో విందుకు వచ్చి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు నారాయణఖేడ్ రాజీవ్ చౌక్‌లో శనివారం సాయంత్రం బస్సు ఎక్కి కూర్చున్నది. అయితే బస్సు ఎక్కుతున్న క్రమంలో ఎవరో బ్యాగును పట్టుకున్నట్లు అనిపించి, అనుమానంతో బ్యాగును పరిశీలించగా.. అందులో 6.30 తులాలకు సంబంధించిన నెక్లెస్, లాంగ్‌చైన్ తదితర బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు బాధితురాలు ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


షాబుద్దీన్(ఫైల్)

బెజ్జంకి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని దేవక్కపల్లి రాజీవ్ రహదారి వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రం నసీర్‌నగర్‌కు చెందిన షాబుద్దీన్(50) ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసుగా పోలీసులు నమోదు చేసుకున్నారు. కాగా దేవక్కపల్లి రాజీవ్ రహదారి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాలను సేకరించి మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

మూడు దశాబ్దాల క్రితం ఉమ్మడి మెదక్ జిల్లాలో నక్సలైట్లు, పోలీసుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లలో ఎంతోమంది పోలీసులు అమరులయ్యారు. వారు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో చారిటబుల్ ట్రస్టులు, విగ్రహాలు, బస్‌షెల్టర్లు నిర్మించి అభిమానాన్ని చాటుకున్నారు. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీస్ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించనున్నారు.

హుస్నాబాద్/తూప్రాన్/రామాయంపేట/పాపన్నపేట/శివ్వంపేట/సిద్దిపేట క్రైం అక్టోబరు 20, ఆంధ్రజ్యోతి


అక్కన్నపేట మండల కేంద్రంలో ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ స్మారకార్థం నిర్మించిన బస్‌షెల్టర్


తూప్రాన్‌లో ఏర్పాటు చేసిన డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం

మీ త్యాగం మరువం

నక్సల్స్ దాడుల్లో అమరులెందరో..

● నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

● అమరుల కుటుంబాలకు సన్మానం

ఎస్‌ఐ జాన్‌విల్సన్...

ప్రస్తుత అక్కన్నపేట మండలం రామవరం వద్ద 1991 డిసెంబరు 19న మొట్టమొదటి సారిగా మావోయిస్టులు (అప్పుడు పీపుల్స్‌వార్ నక్సలైట్లు) మందుపాతరతో బస్సును పేల్చి 15 మందిని హతమార్చిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అందులో సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్‌తో పాటు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సీఐ, కానిస్టేబుల్స్ ఉన్నారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఆయన స్మారకార్థం హుస్నాబాద్ మండలం పందిల్లలో బస్‌షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం నేషనల్ హైవే నిర్మాణంలో దానిని తొలగించారు.

సీఐ యాదగిరి..

రామవరం మందుపాతరలో మృతిచెందిన అప్పటి హుస్నాబాద్ ఇన్‌చార్జి సీఐ యాదగిరి స్మారకార్థం హుస్నాబాద్ మండలం తోటపల్లి స్టేజీ వద్ద బస్‌షెల్టర్ నిర్మించారు. హుజూరాబాద్ సీఐగా ఉన్న యాదగిరి హుస్నాబాద్ ఇన్‌చార్జిగా వచ్చి మావోయిస్టులు పేల్చిన మందుపాతరలో అమరులయ్యారు. ఇక్కడి ప్రజలు ఆయన పేరున బస్‌షెల్టర్ నిర్మించి అభిమానాన్ని చాటుకున్నారు.

ప్రకాష్‌సింగ్...

కోహెడ మండలం సింగరాయ జాతరలో 1991 జనవరి 15న మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ప్రకాష్‌సింగ్ అనే కానిస్టేబుల్ మృతిచెందారు. మరో కానిస్టేబుల్ గాయపడ్డారు. ప్రకాష్‌సింగ్ స్మారకార్థం కోహెడ క్రాసింగ్ వద్ద ప్రజలు విరాళాలతో బస్‌షెల్టర్ నిర్మించారు. ఇప్పటికీ ఆ బస్‌షెల్టర్ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్...

హుస్నాబాద్‌లో ప్రొబెషనరీ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన మసిపట్ల శ్రీనివాస్‌గౌడ్ ఇక్కడి ప్రజల మన్ననలను పొందారు. కొనరావుపేట ఎస్‌ఐగా బదిలీ అయి 1998లో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో మృతిచెందారు. ఆయన పేరున అక్కన్నపేట మండలంలో బస్‌షెల్టర్ నిర్మించారు. ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్న పోలీసుల స్మారకార్థం ఇక్కడ అనేకం నిర్మించారు.

పిల్లుట్ల మందుపాతరకు డీఎస్పీ, సీఐ బలి

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో 1997 నవంబరు 17న నక్సల్స్ పేల్చిన మందు పాతరకు తూప్రాన్ డీఎస్పీ అవ్వారు బాలసుబ్రహ్మణ్యం, తూప్రాన్ సీఐ వెంకటస్వామి, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, లక్ష్మణ్‌నాయక్, సుజాయత్ అలీ బలయ్యారు. దీంతో తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తాలో డీఎస్పీ అవ్వారు బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రతియేటా కార్యక్రమాలు చేపట్టారు.

రామాయంపేట పోలీస్‌స్టేషన్ పేల్చివేతకు 30 ఏళ్లు

రామాయంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 1994 సంవత్సరం జనవరిలో పీపుల్స్ వార్ నక్సల్స్ రామాయంపేట పోలీస్‌స్టేషన్‌ను పేల్చేశారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఎస్‌ఐ సెట్టయ్య నక్సల్స్ దాడి పసిగట్టి పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఇక డ్యూటీలో ఉన్న పోలీసులు సరెండర్ కావడంతో 13 తుపాకులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో పోలీసులు ఎవరూ గాయపడలేదు.

అమరవీరులకు సెల్యూట్

1999 సెప్టెంబరు 13న అర్ధరాత్రి పాపన్నపేట మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను నక్సల్స్ పేల్చేయడంతో హెడ్ కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుల్స్ నర్సింహులు, ఆబేద్ హుస్సేన్, రామ్‌చందర్, ప్రసాద్ అమరులయ్యారు. వారికి గుర్తుగా పాపన్నపేట ఠాణాలో అమరవీరుల స్తూపం నిర్మించారు. నేడు పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి కుటుంబసభ్యులకు మెదక్ ఎస్పీ కార్యాలయంలో సన్మానం ఉంటుందని ఎస్‌ఐ సత్తయ్యగౌడ్ పేర్కొన్నారు.


పాపన్నపేటలో నిర్మించిన అమరవీరుల స్తూపం

నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు

పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా నేటి నుంచి 24వ తేదీవరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీసు విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, ఆంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్‌స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణ, పోలీసులు చేసిన సేవలు, త్యాగాల గురించి ప్రజలకు విద్యార్థులకు తెలియజేస్తారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపికచేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రక్తదాన కార్యక్రమాలు, పోలీస్ అమరవీరుల స్మరిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారు.

షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలు

విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫొటో, వీడియో గ్రాఫర్లకు పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో సేవ, పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫొటోలను, వీడియోలను జిల్లా స్థాయిలో బహుమతి ప్రదానం చేస్తూ.. రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. నేడు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ నిర్వహిస్తున్న పోలీసుల అమరవీరుల దినోత్సవానికి పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సీపీ బీ.అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ మను చౌదరి హాజరుకానునన్నారు. నేటి నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల గురించి తెలుపుతూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త్

పిల్లల్లో మానసిక, శారీరక సమస్యల గుర్తింపునకు ప్రత్యేక యాప్

● వివరాలు పొందుపరిచి చికిత్స

● 63 ప్రశ్నలతో రెండు విడతల్లో పరీక్ష

● ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు

కొండపాక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వస్తున్న చాలామంది విద్యార్థులు శారీరక, మానసిక వైకల్యం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఆరోగ్య విషయాలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. అలాంటి వారి వివరాలను పాఠశాల స్థాయిలోనే గుర్తించేందుకు విద్యాశాఖ ప్రశస్త్ అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా గుర్తించిన వైకల్యాలను నేరుగా విద్యార్థులకు కాకుండా, విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే తెలియజేయనున్నారు.

రెండు విడతలుగా పరీక్షలు


సిద్దిపేట జిల్లాలో అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలలు 1,034, ప్రైవేట్ పాఠశాలలు 226 ఉన్నాయి. మొత్తంగా సుమారు లక్షా యాభై వేలకు పైగా విద్యార్థులు ఉంటారు. వీరందరి వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ యాప్ ద్వారా విద్యార్థులకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించి గుర్తించనున్నారు. మొదటి విభాగంలో 63 ప్రశ్నలను పొందుపర్చి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రశ్నించి, సమాధానాలను ప్రత్యేక ప్రశస్త్ యాప్‌లో పొందుపరుస్తారు. రెండో విభాగంలో యాప్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పూర్తిచేస్తారు. విద్యార్థుల్లో ఉన్న అన్నిరకాల శారీరక, మానసిక, సామాజిక, విద్యా సామర్థ్యాలకు, బుద్ధి మాంద్యం, చలనాలకు సంబంధించి వైకల్యాలను పరిశీలించి యాప్‌లో సర్వే ఫారం ద్వారా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సమాధానాల ఆధారంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వైకల్యాలను వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారు.

అవగాహనా కార్యక్రమాలు

ఇప్పటికే జిల్లాస్థాయిలో ప్రశస్త్ యాప్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కూడా ప్రశస్త్ యాప్‌పై అవగాహన చేశారు. దీంతో విద్యార్థుల వైకల్యాలను గుర్తించి, వారికి చికిత్స అందించనున్నారు.

ఎందుకు.. ఉపయోగం ఏమిటి?

అన్ని వైకల్య పరిస్థితులు కనిపించే విధంగా ఉండవు. చాలా వైకల్యాలను పరిశీలన ద్వారా గుర్తించవలసి ఉంటుంది. నూతన విద్యా విధానం 2020కి అనుకూలంగా అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల్లో గల వైకల్యాలను ప్రశస్త్ ఆప్ ద్వారా గుర్తించడానికి ఎన్‌సీఈఆర్‌టీ వారు తయారు చేసిన ఒక సాధనం.



63 ప్రశ్నల ద్వారా పరిశీలన

ప్రశస్త్ యాప్ ద్వారా వైకల్యాలను గుర్తించనున్నాం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులందరినీ 63 ప్రశ్నల ద్వారా పరిశీలించనున్నాం. యాప్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను గుర్తించి చికిత్స అందించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం.

- శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

'ప్రశస్త్' అనగా..

- ప్రాథమిక అంచనాలు పాఠశాలల కోసం స్క్రీనింగ్ టూల్.
- ఈ సర్వేలో విద్యార్థి అవయవాల ఉపయోగం.
- పనులు ఎలా చేస్తున్నాడు.
- మాటలు ఎలా మాట్లాడుతున్నాడు.
- కాళ్లు, చేతులు ఎలా ఉన్నాయి.
- తల ఎలా ఉన్నది, పొడవు పొట్టి, చేతివేళ్ల మొదలైన శారీరక అవయవాలకు సంబంధించిన సర్వే ప్రశ్నలు ఉంటాయి.
- విద్యార్థి ఎలా చదువుతున్నాడు?
- చూపు ఏ విధంగా ఉంది?
- రంగులను గుర్తిస్తున్నాడా?
- నల్లబల్ల కనిపిస్తుందా? ఎలా రాస్తున్నాడు?
- చదివేటప్పుడు సరిగా చదువుతున్నాడా?
- హోంవర్క్ సరిగా చేస్తున్నాడా?
- అతని ప్రవర్తనలు తరగతి గదిలో ఇతర విద్యార్థులతో ఎలా ఉన్నాయి.
- ఉపాధ్యాయుని సూచనలు పాటిస్తున్నాడా.... గణిత చిహ్నాలను గుర్తిస్తున్నాడా? వంటి సర్వే ప్రశ్నలు ఉంటాయి.

గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి

● నార్మల్ డెలివరీకి ప్రయత్నించిన వైద్యులు

● పరిస్థితి విషమంగా ఉండడంతో సెక్షన్ డెలివరీకి తరలింపు

● విగత జీవిగా జన్మించిన మగ శిశువు


మృతిచెందిన శిశువును పట్టుకుని రోధిస్తున్న మనీలా కుటుంబసభ్యులు

గజ్వేల్/గజ్వేల్‌రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన శిశువు మృతిచెందాడు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామానికి చెందిన రామనిగళ్ల మనీలా(26) శనివారం ఉదయం ప్రసూతి కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. మొదటి కాన్పు సాధారణంగా జరగడంతో రెండో కాన్పు సైతం సాధారణంగా చేసేందుకు గజ్వేల్ వైద్యులు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే మనీలా ఆరోగ్యం విషమంగా మారడంతో వెంటనే సెక్షన్‌కు తరలించారు. ఉదయం 7 గంటలకు మగబిడ్డ విగత జీవిగా జన్మించినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మనీలా బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సెక్షన్ డెలివరీ చేసి ఉంటే తమ శిశువు బతికేదని, వైద్యుల నిర్లక్ష్యంతోనే బాబు చనిపోయాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ విషయమై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్‌ను వివరణ కోరగా.. శిశువు మృతిచెందిన విషయం వాస్తవమేనని, ఈ విషయంలో విచారణ జరుపుతామని తెలిపారు.

విద్యాపీఠంలో వైభవంగా గజపాద ఘట్టం


సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఏనుగుకు పూజలు చేస్తున్న మహేశ్వరశర్మ సిద్ధాంతి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఆదివారం ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో గజపాదఘట్టణోత్సవం వైభవంగా జరిగింది. ఇందులోభాగంగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా కడకంచి గ్రామం నుంచి వచ్చిన గజరాజుపై అమ్మవారిని ఉంచి విశేషోత్సవం ద్వారా బుద్ధి బలం, సౌభాగ్యం, సంపద, ధైర్యం కలుగుతాయని సిద్ధాంతి ప్రబోధించారు. ఈ మహోత్సవంలో పాల్గొనే విద్యార్థుల్లో బుద్ధి వికాసం, మహిళలకు అఖండ సౌభాగ్యం, పురుషులకు విశేష సంపద, ప్రతి వ్యక్తికి ధైర్యం, సంపదలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు ప్రశాంత్‌కుమార్, సాయి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, తోపాజి అనంతకిషన్ తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీని అందుకుంటున్న మెదక్ జట్టు

ఉమ్మడి జిల్లా వాలీబాల్ విజేత మెదక్

మెదక్ అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వాలీబాల్ విజేతగా మెదక్ జట్టు నిలిచింది. అండర్-17 బాల బాలికలకు ఆదివారం గీత హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో మెదక్ జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి సిద్దిపేట, సంగారెడ్డి జట్లను ఓడించి ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ద్వితీయస్థానంలో సిద్దిపేట, తృతీయస్థానంలో సంగారెడ్డి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో సంగారెడ్డి జట్టు సిద్దిపేట, మెదక్ జట్లను ఓడించి ప్రథమస్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో సిద్దిపేట, తృతీయస్థానంలో మెదక్ నిలిచాయి. ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు ఈనెల 28న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు దగ్ధం


కాలిపోయిన నోట్లు

పాపన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రేకుల ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోదండం సాయిలు బుడగజంగం కాలనీలో రేకుల ఇంట్లో నివాసముంటున్నాడు. ఓ పని నిమిత్తం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. బయటకు పొగ వ్యాపించడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో బీరువాలో ఉన్న డబ్బులు, బంగారం, వెండి వస్తువులు, నిత్యావసర సరుకులు, వస్తువులు మంటల్లో కాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

పార్టీలకతీతంగా హక్కుల సాధనకు కృషి చేద్దాం

● కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్/వర్గల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం పార్టీలకతీతంగా ముదిరాజ్‌లందరూ ఏకతాటిపైకి రావడం ఐకమత్యానికి నిదర్శనమని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గం చక్రిపురం క్రాస్ రోడ్ సిరి గార్డెన్స్‌లో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయి బలాయి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. తొందరలోనే బీసీ కులగణన పూర్తవుతుందన్నారు. కులగణన తర్వాత ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీఏలోకి మార్చే ప్రక్రియ కోసం కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షుడు పండగ బాలు, పిట్టల నాగరాజ్, గడ్డల పాండు, జెడల శంకర్, పుర యాదగిరి, శ్రీకాంత్, హరిబాబు పాల్గొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికిఖాల్సాలో జరిగిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠకు డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. అనంతరం పెద్దమ్మతల్లి ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు శ్రీరాం నర్సింహులు, గ్రామ అధ్యక్షుడు జెల్ల మల్లేశం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో హరీశ్‌రావు

వర్గల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం తునికిఖాల్సాలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మాణ పెద్దమ్మతల్లి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. వారిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. వారి వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.


ముదిరాజ్ నేతలతో నీలం మధు సంఘీభావం

అసలే ఇరుకు రోడ్లు.. ఆపై అడ్డంగా తోపుడు బండ్లు

నారాయణఖేడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి)

నారాయణఖేడ్ పట్టణంలో అసలే ఇరుకు రోడ్లు.. ఇందుకు తోడు రోడ్లపై చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు వరుసగా పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్రఇబ్బందులు తప్పడం లేదు. తరచూ ట్రాఫిక్ సమస్యలతో స్థానికులు, వాహనదారులు సతమతమవుతున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు అయిన రాజీవ్ చౌక్, అంబేడ్కర్ చౌక్‌ల వద్ద పరిస్థితి మరింత అధ్వానం. రాజీవ్ చౌక్ సమీపంలో బాలికల ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలోని, రాయిపల్లి రోడ్డు ఇరుకుగా మారడంతో గత ఏడాది వ్యాపారుల పాన్‌డబ్బాలను, షాపులను తొలగించారు. కొద్ది రోజుల నుండి ఆయాప్రాంతాల్లో తోపుడు బండ్లను మరింత ముందు వరకు పెట్టడంతో పాదచారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో, రోడ్డుపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ఎవ్వరూ వ్యవహరించవద్దని, అలా ఎవ్వరూ వ్యవహరించినా చర్యలు తీసుకుంటామన్నారు.


ఖేడ్‌లోని రాజీవ్ చౌక్ వద్ద నిలిపిన తోపుడు బండ్లు

- = సంక్షిప్తం = -

నియోజకవర్గంలో నేడు మిషన్‌భగీరథ సరఫరా నిలిపివేత

నర్సాపూర్,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):: నర్సాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం, గుమ్మడిదల మండలాలకు సరఫరా అయ్యే మిషన్‌భగీరథ మంజీర నీటిని పైప్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 21వ తేదీన సరఫరా నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, కొల్చారం, వెల్దుర్తి, మాసాయిపేట,హత్నూర గ్రామాలతో పాటు జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని గ్రామాలకు మంజీర నది ఉన్న చక్రియాల్ నుంచి సరఫరా అయ్యే ప్రధాన నీటిపైపులైన్ మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయా పంచాయతీలు తాత్కాలికంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాటు చేయాలని సూచించారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

జిన్నారం, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన కుమారుడి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు విద్యార్థులకు బిస్కెట్స్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఇస్మాయిల్‌ఖాన్ పేట గ్రామానికి చెందిన లక్ష్మి, నర్సింం దంపతుల కుమారుడు మధు 3 నెలల క్రితం ప్రమాదంలో మరణించాడు. తమ కుమారుడి జ్ఞాపకార్థం ఆదివారం జిన్నారం జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వారు బిస్కెట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ నరేందర్

మెదక్ అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 22న మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లా ఉద్యోగులు ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ దొంత నరేందర్ తెలిపారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఐదు విడతల కరువు భత్యం చెల్లించాలన్నారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

చిన్నశంకరంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వెంటనే గ్రూప్ వన్ రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మండలకేంద్రమైన కంగ్టికి చెందిన కులకర్ణి శ్రీనివాస్‌కు వైద్యుల ఖర్చుల కోసం రూ.60 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును ఆదివారం ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రాంచందర్‌తండా, వంగ్దల్ మాజీసర్పంచులు రాంసింగ్, జైపాల్, తదితరులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన కిషన్‌నాయక్ తండా మాజీ ఉప సర్పంచు లష్కర్‌నాయక్, నమ్లీమేట్‌కు చెందిన బొక్క బేతయ్య, ఆదివారం ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

● చిన్నశంకరంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరారం గ్రామానికి చెందిన దిడ్డికాడి మత్తడి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి ఆదివారం సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యూత్ మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌గౌడ్, రామస్వామి, అక్బర్, శేఖర్, వెంకటేశం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

కొండాపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నియోజక వర్గ కాంగ్రెస్ కమిటీ అధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో అదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరై మాట్లాడారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలాల, గ్రామాల, పట్టణలోని కాంగ్రెస్ నాయకులు బాధ్యతగా పని చేయాలని సూచించారు. దీనికి పూర్తి బాధ్యత ఎన్‌యూఎస్ సీయూత్, కాంగ్రెస్ నాయకులు ఓటర్లలో అవగాహన పెంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృసి చేయాలని కోరారు. ఈ సదస్సులో మాజీ ఎమెల్సీ సత్యనారాయణ, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్లు కుమార్, రాంచందర్‌నాయక్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంజనేయులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి: పీఆర్టీయూ

మెదక్ అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 317 జీవోలో నష్టపోయిన ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సుంకరి కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను చెల్లించాలన్నారు. పీఆర్సీని ఇవ్వాలని, బదిలీలు కోరుకున్న ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాకు పంపించేలా చర్యలు చేపట్టాలన్నారు. పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లకు మినిమం టైం స్కేల్ అందించాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, రాష్ట్ర, జిల్లా బాధ్యులు వెంకట్రామిరెడ్డి, దుర్గయ్య, బసవరాజ్, మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మహిళా విభాగం నాయకురాలు స్వరూప, రాణి, శ్రీజ్యోతి, దీప, బాధ్యులు సంతోష్‌కుమార్, చంద్రశేఖర్, నరేందర్ రెడ్డి, సిద్దిరాములు, యాదవరెడ్డి పాల్గొన్నారు.



మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ

ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు చుక్క రాములు

జహీరాబాద్,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తుందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, చుక్కరాములు పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో సీపీఎం జిల్లా 3వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. సమస్యల సాధనలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళనలు, నిరసనల కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చురుకుగా పాల్గొనాలన్నారు. ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎంనాయకులు మల్లికార్జున్,మల్లారెడ్డి, మల్లేశం,జయరాజ్, రాజయ్య, మాణిక్యం, రాంచం ద్రం, సాయిలు, మైపాల్, నర్సయ్య, రాజిరెడ్డి, చంద్రన్న, సంగన్న వీరగౌడ్ పాల్గొన్నారు. సీపీఎం జిల్లా నూతన కార్యవర్గాన్ని సైతం ఏర్పాటు చేశారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చికిత్స

పాపన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద అనారోగ్యంగా పడి ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఆదివారం చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హరిత హోటల్ సమీపంలో తెలుపు రంగు చొక్కా, ధోతీ ధరించి సుమారు 65 ఏళ్ల వయసున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి లేవలేని స్థితిలో పడి ఉన్నట్లు వివరించారు. ఈ సమాచారమందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం అతడిని 108 అంబులెన్సులో మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712657920 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.


గుర్తు తెలియని వ్యక్తి

ఖోఖో పోటీలకు చందాయిపేట విద్యార్థిని


దీప్తి

చేగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందాయిపేట్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపికైంది. ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ అండర్ 14 బాలికల విభాగం నుంచి మెదక్ జిల్లా టీం నుంచి చేగుంట మండలం చందాయిపేట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి దీప్తి ఒక్కరే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ శంకర్ ఆదివారం తెలిపారు. దీప్తి రాష్ట్రస్థాయి ఖోఖోకు పోటీలకు ఎంపికావడం పట్ల పాటశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అమ్మ అదర్శ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నియోజకవర్గంలో రోడ్లకు రూ.5 కోట్లు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్,అక్టోబరు 20: నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు పంచాయతీరాజ్ పరిధిలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.5కోట్లు సీఆర్ఆర్ పథకం నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం పేర్కొన్నారు. నర్సాపూర్ మండలంలో మూసాపేట నుంచి హత్నూర మండలం దౌల్తాబాద్ రోడ్డుకు రూ. ఒక కోటి, జడ్పీరోడ్డు తుజాల్‌పూర్ నుంచి కాజీపేట వరకు రూ.50.35లక్షలు, మాసాయిపేట మండలంలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి హకీంపేట వరకు రూ.1.83కోట్లు, మాసాయిపేట మండలం జడ్పీ రోడ్డు నుంచి నాగ్సాన్‌పల్లి వరకు రూ.1.65కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఐటీఐ ఏర్పాటుకు స్థలపరిశీలన


అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు కోసం ఖేడ్ శివార్లలోని ప్రభుత్వమోడల్ డిగ్రీ కళాశాల ముందు 161బీ జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీవో అశోక చక్రవర్తి, ఆర్ఐ.మాధవరెడ్డితో కలిసి పరిశీలించారు. ఖేడ్‌కు ఐటీఐ మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ వినతిపత్రాన్ని అందించినందున రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ స్థలాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు అందుబాటులో ఉన్న 2.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, తదితరులు ఉన్నారు.

హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి

నారాయణఖేడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వసతీ గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు సీహెచ్.అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లో జరిగిన సంఘం డివిజన్‌స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖేడ్‌లోని కొన్ని వసతీ గృహాల్లో మెను ప్రకారం నాణ్యమైన భోజనం, అల్పాహారం ఇవ్వడంలేదన్నారు. సమావేశంలో సంఘం డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

కేదార్‌నాథ్ జగద్గురును దర్శించుకున్న నగేష్ షెట్కార్

నారాయణఖేడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):కేదార్‌నాథ్ జగద్గురు బీమా శంకర్ శివాచార్యులు ఆదివారం కర్ణాటకలోని బీదర్‌కు విచ్చేయడంతో ఉమ్మడి మెదక్‌జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీసభ్యుడు నగేష్‌షెట్కార్, ఆయన సోదరిమణి ప్రవీణబస్వాలే తదితరులు ఆయనను దర్శించుకొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాసాయిపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బైక్ ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన తలారి బాబు(40) అనే వ్యక్తి ఈ నెల 16న మాసాయిపేటలోని ఆటో స్టాండు వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్లాట్ ఓనర్స్‌కు న్యాయం చేయాలి

లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్

రామచంద్రాపురం, అక్టోబరు 20: కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ ఓనర్లకు చెందిన భూమిని అక్రమంగా స్వాధీనపర్చుకునేందుకు యత్నిస్తున్న వారి నుంచి తమకు న్యాయం చేయాలని లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బస్సులో ప్లాట్ ఓనర్స్ మియాపూర్ ఏసీపీ కార్యాలయం, కొల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలివెళ్లి వినతి పత్రం సమర్పించారు. కొల్లూరులోని సర్వే నంబర్లు 172, 173, 174, 175, 177, 179, 180, 181, 182, 183, 184, 185, 186, 187, 188, 189, 190లలో మొత్తం 1,200ప్లాట్లు, 143 ఎకరాల భూమి కలిగి ఉందన్నారు. 2002-03వ సంవత్సరంలో నాదేండ్ల ఎస్టేట్ తయారు చేసుకున్న ఫోర్జరీ డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీన పర్చుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్లాట్ ఓనర్లు తమ స్థలంలోకి వెళ్లి తమ స్థలాలను పరిశీలించారు. అసోసియేషన్ సభ్యులు మూర్తి, రామ్మోహన్‌రావు, సుబ్రమణ్యం, యూనస్ ఏసీపీ, సీఐకి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు


ఘనపూర్ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

తూప్రాన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2009-10 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆనాటి మధుర స్మృతులు నెమరేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు శివకుమార్, భాస్కర్‌రెడ్డి, పరమేశ్వరచారి, సంజీవరెడ్డి, లలితలను ఘనంగా సన్మానించారు.

కొండాపూర్ మండలంలో..


తెర్పోల్‌లో పాఠశాలలో సమావేశమైన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు


మారెపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కొండాపూర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1992-93 బ్యాచ్, 1995-96 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం తెర్పోల్ ఉన్నత పాఠశాలలో, మారెపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వేర్వేరుగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకున్నారు. తమకు చదువు నేర్పించిన ఉపాధ్యాయులతో పాటు ముఖ్య అతిథులుగా హాజరైన ఉపాధ్యాయులకు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పరస్పర క్షేమసమాచారాలు తెలుసుకున్నారు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే..


వ్యాయామ పరికరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

నిజాంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మంచి ఆరోగ్యం చేకూరుతుందని కేటీఆర్ ట్రస్ట్ చైర్మన్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో అదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఓపెన్‌జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు దాతల సహకారం అభినందనీయమని, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యమే మహాభాగ్యం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా ఉందని అభినందించారు. నీటి సౌకర్యం కోసం ఓపెన్ జిమ్‌లో బోరు బావి ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. అనంతరం దాతలందరికీ ధన్యవాదాలు తెలిపి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, దాతలు తదితరులు ఉన్నారు.

ఐటీఐ విద్యతో ఉద్యోగ, ఉపాధికి బాటలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఐటీఐలకు పునర్వైభవం తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ కె.రాజేశ్వర్‌రావు తెలిపారు. జిల్లాలోని సంగారెడ్డితో పాటు హత్నూర ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా ప్రభుత్వం తీర్చిదిద్దిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఏటీసీలు దోహదపడతాయన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాల్లో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చామని, ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏటీసీలో అందుబాటులోకి తెచ్చిన ఆరు కొత్త కోర్సుల్లో ఇప్పటి వరకు 172 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. రోజు రోజుకూ సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంగా ఆధునితకను అందిపుచ్చుకునేందుకు యువత ముందుకు రావాలని ఆయన కోరారు.

అన్నీ చేశారు.. ఆఖర్లో మరిచారు

● పాఠశాలకు బోర్డు ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం


సంగారెడ్డిలో పేరు లేని సర్కారు బడి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కింద పలు అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సంగారెడ్డిలోని పాత జిల్లాజైలు సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను(జీఎన్‌పీఎస్)ను కూడా ఆధుకరించారు. సుమారు రు.14 లక్షల వ్యయంతో పాఠశాలలో ఎలక్ట్రిసిటీ, మేజర్, మైనర్ రిపేర్లు, రన్నింగ్ వాటర్, టాయిలెట్స్, డ్యూయల్‌డెస్కులు సమకూర్చారు. అంతే కాకుండా పాఠశాల కొత్తగా కనపడేలా రంగులు కూడా వేశారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ చివరి పాఠశాల పేరును మాత్రం పేయింటింగ్స్‌తో రాయడం మరిచారు. ఈ పాఠశాలలో 'మన ఊరు-బడి' పనులు పూర్తయి ఏడాదికి పైనే గడుస్తున్నా ఇంత వరకు పాఠశాల పేరు రాయకపోవడం గమనార్హం. చూసిన వారు ఇది సర్కారు బడేనా లేక ఇంకేదైనా ప్రభుత్వ శాఖ భవనమా అనే సందేహాన్ని వ్యక్తపరుస్తున్నారు.

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం


ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌శ్రేణుల నిరసన


ఖేడ్‌లోని బసవేశ్వర్‌చౌక్ వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్, జీఎంఆర్ ఫౌండేషన్‌నాయకులు


హత్నూరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మల దహనం చేపట్టాయి. రెండు జిల్లాల్లోని ఆయా మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రధాన రహదారులపై ధర్నా, రాస్తారోకోలు చేయడంతో రాకపోకలకు అంతరాయం తీవ్ర అంతరాయం ఏర్పడింది. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తున్న రూ.10వేలకు అదనంగా కలిపి ఎకరాకు రూ. 15 వేల చొప్పున రైతుబంధు ఇస్తామంటూ బూటకపు హామీనిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, తీరా గెలిచాక.. రేవంత్ రెడ్డి ఎక్కువ ఇవ్వకపోగా బీఆర్ఎస్ ఇచ్చిన రూ.10 వేలను కూడా ఎగ్గొట్టిందని దుయ్యబట్టారు.

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డిలో మండల అధ్యక్షుడు చక్రపాణి నేతృత్వంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. జహీరాబాద్ పట్టణంలోని బస్టాండ్‌వద్ద రహదారిపై ఎమ్మెల్యే మాణిక్‌రావు నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుపడటంతో పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. జోగిపేటలో స్థానిక హనుమాన్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు దిగారు. జిన్నారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు తరలివచ్చారు. ప్రభుత్వం హామీలు అమలు చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. హత్నూర మండలకేంద్రంలో నిర్వహించిన ఆందోళనలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, వట్‌పల్లి, కంది, మునిపల్లి, కల్హేర్, సిర్గాపూర్, మనూర్, కంగ్టి, నాగల్‌గిద్ద, రాయికోడ్ మండలాల్లోని ప్రధానరహదారులపై ఆందోళన చేపట్టారు.

మెదక్ జిల్లాల్లో..

మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశాయి. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని మెదక్ చేగుంట రహదారిపై ధర్నా రాస్తారోకో చేసి సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. ప్రతీ రైతుకు మేలు జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాపన్నపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దిష్టి బొమ్మలను దహనం చేశారు. రామాయంపేటలో బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. తూప్రాన్‌లో గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద పాత హైవే రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అదేవిధంగా చేగుంట, రేగోడు, అల్లాదుర్గం తదితర మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు.



